క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌ను కలిసిన వీసీ



టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డిని కలిసిన వీసీ భారతి

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి గురువారం టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఏవీ.ధర్మారెడ్డిని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా వర్సిటీని విద్యారంగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకెళ్లాలని, జాతీయ స్థాయిలో వర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని వారు వీసికి సూచించారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యాసామగ్రి అందజేస్తున్న మన సంస్కృతి సేవా ట్రస్ట్ చైర్మన్ హరినాథరెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని పిల్లారికోన ఎస్టీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మన సంస్కృతి సేవా ట్రస్ట్ చైర్మన్ హరినాథరెడ్డి విద్యాసామగ్రి వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలనే ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు తేజోవతి, జయరాం, హిమాచల్‌రెడ్డి పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



హంసశ్రీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం మల్లయ్యపల్లికి చెందిన హంసశ్రీ మదనపల్లి నవోదయ పాఠశాలకు ఎంపికైంది.గ్రామానికి చెందిన కల్లూరు శ్రీనివాసులు, అంజలి కుమార్తె కల్లూరు హంసశ్రీ పాకాల మండలం పాలగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. గతంలో తిరుపతిలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష రాసింది. ఇందులో ఉత్తీర్ణత సాధించి మదనపల్లి నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


వేశాలమ్మ ఆలయం ఈవోగా మమత



కె.మమతను సత్కరిస్తున్న నరసింహాచారి, సునీల్ చక్రవర్తి, అశోక్

తిరుపతి కల్చరల్: వేశాలమ్మ ఆలయ ఈవోగా కె.మమత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె సూళ్లూరుపేట గ్రూప్ ఆలయాల ఈవోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆమెకు ఆలయ చైర్మన్ విజయకుమార్, మేనేజర్ హేమచంద్రరావు, అర్చకులు స్వాగతం పలికారు. వేశాలమ్మ ఆలయ ఈవోగా పని చేస్తున్న కె.రామచంద్రారెడ్డి గుడిమల్లం ఆలయం రెగ్యులర్ ఈవో, సురుటుపల్లి ఆలయ ఇన్‌చార్జ్ ఈవోగా బదిలీ అయ్యారు. కె.మమతను స్థానిక కార్పొరేటర్ నరసింహాచారి, వైఎస్సార్ సీపీ నేత సునీల్ చక్రవర్తి, మాజీ చైర్మన్ అశోక్ శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

పేద పిల్లలకు సాయం చేయండి



పుస్తకాలు అందజేస్తున్న ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మహ్మద్‌ఖాశీమ్

తిరుపతి మంగళం: విద్య భావితరాలకు బంగారు భవిష్యత్‌ను ఇస్తుందని, పేద పిల్లల చదువుకు చేయూత ఇవ్వాలని మంగళం సప్తగిరి నగర్ పంచాయతీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని సప్తగిరినగర్ పంచాయతీలోని పేద విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంటిలో నిరుపయోగంగా ఉన్న పుస్తకాలను తీసుకొచ్చి సచివాలయంలో అందజేశామన్నారు. వాటిని అవసరమైన వారు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 6, 7, 8, 10 తరగతులకు సంబంధించిన టెక్స్‌బుక్స్ సప్తగిరినగర్ పంచాయతీ సచివాలయంలో ఉన్నాయని తెలిపారు. అలాగే మంగళం పంచాయతీలోని ప్రజలు తమ ఇళ్లలో వృథాగా ఉన్న పుస్తకాలను తీసుకొచ్చి సచివాలయంలో ఇస్తే పేద పిల్లలకు ఉపయోగంగా ఉంటాయని పిలుపునిచ్చారు.

ఇక ఫ్రీ లెఫ్ట్‌లు

- తిరుపతిలో కూడళ్ల విస్తరణకు చర్యలు
- ఇప్పటికే అందుబాటులోకి ఏడు ఫ్రీ లెఫ్ట్‌లు
- అవసరం ఉన్న చోట లింక్ రోడ్లు
- మెరుగైన రవాణా వ్యవస్థే లక్ష్యం
- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి



ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్రీ లెఫ్ట్ రోడ్డు

ఇరుకురోడ్లు.. ఎక్కడ చూసినా ట్రాఫిక్ ఇక్కట్లు.. కూడళ్లలో వాహనదారుల అవస్థలు.. పార్కింగ్ కష్టాలు.. ఇదీ ఒకప్పటి తిరుపతిలో పరిస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. కూడళ్ల విస్తరణతోపాటు ఫ్రీ లెఫ్ట్ రోడ్ల అభివృద్ధితో వాహనదారుల కష్టాలకు చెక్ పడుతోంది. తిరుపతి నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుపతి నగరంలో కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లు, లింక్ రోడ్ల అభివృద్ధికి నడుం బిగించారు. అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగుతూ నగర వాసుల మన్ననలు పొందుతున్నారు. –తిరుపతి తుడా

తిరుపతి నగరం ప్రముఖ యాత్రా స్థలం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీనికితోడు సుమారు నాలుగు లక్షలకు పైగా జనాభా ఉంది. జనాభా, రవాణాకు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో దశాబ్దాలుగా ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చొరవ తీసుకుని ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించి ట్రాఫిక్ నుంచి ఉపశమనం కలిగించాలని సంకల్పించారు. ఏకకాలంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలు రోడ్లు అందుబాటులోకి రావడంతో నగరంపై ఒత్తిడి తగ్గింది. పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. దీంతో కూడళ్ల వద్ద రోడ్డు విస్తరణతో పాటు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే టీటీడీ యాజమాన్యం, ఎస్వీ యూనివర్సిటీ అధికారులతోపాటు ప్రైవేటు స్థలాల యజమానులను ఒప్పించి రోడ్లు, కూడళ్ల విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే మ్యూజిక్ కాలేజీ వద్ద ఫ్రీ లెఫ్ట్, కోర్టు వీధి విస్తరణకు స్థలాన్ని సేకరించారు. అలానే టౌన్ క్లబ్ కమిటీని ఒప్పించి ఫ్రీ లెఫ్ట్ రోడ్డును సాధించారు. అలానే ఎస్వీ యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి ఫ్రీ లెఫ్ట్ రోడ్డు ఏర్పాటుచేశారు. ఎమ్మార్‌పల్లి పోలీస్ స్టేషన్ పక్కన మరో ఫ్రీ లెఫ్ట్‌ను రాత్రికి రాత్రే అభివృద్ధి చేశారు. లక్ష్మీపురం కూడలి వద్ద ఇప్పటికే మరో ఫ్రీ లెఫ్ట్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇలా మొత్తం ఏడు ప్రాంతాల్లో ఫ్రీ లెఫ్ట్‌లు అందుబాటులోకి రావడంతో ప్రజారవాణా మెరుగుపడి ట్రాఫిక్ కష్టాలను కొంతమేర అధిగమించారు.



టౌన్ క్లబ్ వద్ద ఏర్పాటుచేసిన ఫ్రీ లెఫ్ట్ రోడ్డు

అవసరమున్న చోట లింక్ రోడ్లు

రోడ్ల అభివృద్ధి, కూడళ్ల విస్తరణ చూసిన నగర వాసుల నుంచి లింక్ రోడ్ల అభివృద్ధిపై వినతులు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో 30 ఏళ్లుగా సరైన రోడ్డు వ్యవస్థలేని గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్‌కు లింక్ రోడ్డును అభివృద్ధి చేశారు. అలానే పాయ్ వైస్‌రాయ్ హోటల్ వద్ద తిరుమల బైపాస్ రోడ్డు– కపిలతీర్థం రోడ్డును కలుపుతూ 20 అడుగుల లింక్ రోడ్డును ఏర్పాటుచేశారు.

మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటే లక్ష్యం



నగర ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను తీసుకువస్తున్నాం. ఇందుకోసం రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నాం. చరిత్రలో గుర్తుండిపోయేలా రోడ్ల అభివృద్ధిని చేపట్టాం. మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి దశ మారుతుంది. 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బృహత్ ప్రణాళికలను అమలుచేస్తున్నాం. ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నాం.

–భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్

పెద్ద గంగమ్మ, వేశాలమ్మ ఆలయాల అభివృద్ధి



తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి

- అమ్మవార్లకు పూర్వవైభవం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెల్లడి

తిరుపతి కల్చరల్: అత్యంత పురాతనమైన తాళ్లపాక పెద్ద గంగమ్మ, వేశాలమ్మ ఆలయాలను టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు నాగేశ్వరరావు, ప్రసాద్‌తో కలిసి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న తాళ్లపాక పెద్ద గంగమ్మ, వేశాలమ్మ ఆలయాలను పరిశీలించారు. ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో అత్యంత పురాతనమైన వేశాలమ్మ ఆలయాన్ని రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షల అంచనా వ్యయంతో ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. అలాగే తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయాన్ని రూ.60 లక్షలతో పునర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డిని అభ్యర్థించినట్టు పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఈ ఆలయాల అభివృద్ధి చేసేందుకు ఈవో సానుకూలంగా స్పందించారని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. ఈ మేరకు అంచనాలను వేసి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావుకు సూచించినట్లు తెలిపారు.

తిరుపతిలో వేగంగా రోడ్ల పనులు



మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మెరుగైన ప్రజారవాణా కోసం చేపట్టిన రోడ్లను శరవేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం హీరో హోండా షోరూమ్ –పద్మావతిపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని డీఈఈ సంజయ్‌కుమార్‌ను ఆదేశించారు. అంకుర హాస్పిటల్ మాస్టర్ ప్లాన్ రోడ్డు, హీరో హోండా షోరూమ్ పక్కన పద్మావతిపురం వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న లింక్ రోడ్డు పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దశాబ్దాలుగా నగర ప్రజలు ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. గత పాలకులు భవిష్యత్‌కు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేయకపోవడం ప్రజలకు, నగర విస్తరణకు శాపంగా మారిందన్నారు. తిరుపతి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 18 మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు లింక్ రోడ్లు, కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. రోడ్లన్నీ అందుబాటులోకి వస్తే తిరుపతికి కనెక్టివిటీ పెరగడంతో పాటు నగర వాసులు ట్రాఫిక్ చక్రబంధం నుంచి ఊపిరి పీల్చుకుంటారని పేర్కొన్నారు. నగర తూర్పు ప్రాంతం సుమారు మూడు వేల ఎకరాల్లో విస్తరిస్తుందన్నారు. తద్వారా కార్పొరేషన్‌కు ఐదారేళ్లలోనే రెట్టింపు స్థాయిలో ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, పులుగోరు ప్రభాకర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ మోహన్ పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ను ప్రజలకు చేరువ చేయాలి





హాజరైన సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీర్లు, మాట్లాడుతున్న కమిషనర్ హరిత

- సర్వీస్ చార్జీ లేకుండా 11 రకాల సేవలు
- జూలై ఒకటి నుంచి సచివాలయాల వద్ద క్యాంపులు
- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ‘జగనన్న సురక్ష’ను పకడ్బందీగా అమలుచేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించేందుకు సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీర్లు సన్నద్ధం కావాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పిలుపునిచ్చారు. ఎస్వీయూ ఆడిటోరియంలో గురువారం ‘జగనన్న సురక్ష’పై మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, సరీ్వసు చార్జీ లేకుండా 11 రకాల సేవలు అందించేందుకు ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జూలై ఒకటి నుంచి తిరుపతిలోని వార్డు సచివాలయాల్లో జగనన్న సురక్షను నిర్వహిస్తున్నామన్నారు. ‘జగనన్నకు చెబుదాం’కు అనుబంధంగా అన్ని రకాల ప్రజా వినతులను సంతృప్తిస్థాయిలో పరిష్కరించేందుకు సిద్ధం కావాలన్నారు. ఇందులో భాగంగా 24వ తేదీ నుంచే ఇంటింటికీ వెళ్లి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ధ్రువీకరణ పత్రాల జారీకి వినతులు సేకరించాలని సూచించారు. క్యాంపుల నిర్వహణ సమయంలో వినతుల స్వీకరణ, పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్‌లను వేర్వేరుగా సచివాలయాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏ రోజు ఏ సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో ముందుగా ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో సుశీలాదేవి, అదనపు కమిషనర్ సునీత, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ ఆఫీసర్లు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, సూపరింటెండెంట్ రవి, డిప్యూటీ తహసీల్దార్ అశోక్ రెడ్డి, ఆర్‌ఐ రామచంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పాకాల: సర్దుబాటు పేరుతో ప్రజలపై మోపిన అధిక విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నేత మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన గురువారం పాకాలలో కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ యూనిట్ విద్యుత్‌ను రూ.3లకు కొనాల్సి ఉండగా అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ భారాన్ని పేద, మధ్య తరగతి ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గేలాగా చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో ద్వారకాబాబు, నరేంద్రబాబు, హరిప్రకాష్, రవి, వరాలు, రాజేంద్ర, విజయ్‌కుమార్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య నాయకురాళ్లు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: విశాఖలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆమె గురువారం విద్యార్థులతో కలిసి బైరాగిపట్టెడ అర్బన్ ఎదురుగానున్న ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చినా వాటిని పటిష్టంగా అమలుచేయకపోవడంతోనే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. విశాఖలో ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులపై చేయి చేసుకున్న ఎస్‌ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా, రత్నమ్మ, హరిత, పార్వతి, అఖిల పాల్గొన్నారు.

టీడీపీ నాయకురాలికి సీఎం రిలీఫ్ ఫండ్



సురేఖ, సోమశేఖర్‌కు చెక్కు అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం అగరాల పంచాయతీకి చెందిన టీడీపీ నాయకురాలు, గతంలో జన్మభూమి కమిటీ సభ్యురాలిగా పని చేసిన సురేఖ భర్తకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు మంజూరైంది. ఆమెకు గురువారం చెక్కును ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి అందజేశారు. సురేఖ భర్త సోమశేఖర్‌రెడ్డి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక భారం ఎక్కువ కావడంతో సురేఖ ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు మంజూరు చేయించారు. పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి అందించిన సహకారం మరవలేనిదని, రానున్న రోజుల్లో చెవిరెడ్డికి అండగా ఉంటామని సురేఖ, సోమశేఖర్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ నుంచి విద్యుత్ రంగాన్ని కాపాడాలి

చంద్రగిరి(తిరుచానూరు): కార్పొరేట్ కబంధ హస్తాల నుంచి విద్యుత్ రంగాన్ని కాపాడాలని సీపీఎం కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ట్రూ అప్ సర్వీసులు, ఇంధన చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ గురువారం యోగిమల్లవరంలో కరపత్రం ఆవిష్కరించారు. ఆయనతో పాటు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.జయచంద్ర మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు చెల్లించిన మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేయడం తగదన్నారు. సోలార్ విద్యుత్ స్మార్ట్ మీటర్ల సరఫరాపై చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ మీటర్ల రీడింగ్‌ను పరిశీలించామన్నారు. గత నెలలో రూ.300 బిల్లు వస్తే, ఇప్పుడు రూ.1750 బిల్లు వచ్చిందని ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. ఇతర చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం సరైనది కాదని సూచించారు. తక్షణమే సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం తిరుచానూరు కార్యదర్శి సుమన్, చిన్నబాబు, పెరుమాళ్, నీలకంఠం, శేఖర్, శేషాద్రి, సూర్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో రమేష్‌బాబు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కొనియాడారు. ఆయన గురువారం చంద్రగిరి మండలం కొంగరవారిపల్లి, ముంగిలిపట్టు, ఎం.కొత్తపల్లి, మామండూరు, ఐతేపల్లి, అగరాల, ఏజీపల్లి, పులిత్తివారిపల్లిలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. ప్రజల కోసం ఏర్పాటుచేసిన టిఫిన్, భోజన వసతులను తనిఖీ చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని గడపాలనే ఆకాంక్షతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

పదవి కోసం పాకులాడుతోంది పవన్‌కళ్యాణే



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: దుష్టులతో పొత్తులు పెట్టుకుని ఎలాగైనా ముఖ్యమంత్రి కావాలని పాకులాడుతోంది జనసేన అధినేత పవన్‌కళ్యాణేనని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ విమర్శించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పదవుల కోసం పాకులాడకుండా, మంత్రి పదవులను సైతం లెక్కచేయకుండా కాపుల సంక్షేమ కోసం ఉద్యమాలు గొప్ప నాయకుడు ముద్రగడ పద్మనాభమన్నారు. తుని ఘటనలో కాపులపై కేసులు బనాయించి జైళ్లకు పంపిన కాపు ద్రోహి చంద్రబాబు అన్నారు. ఆ కేసుల్లో తిరుపతి నుంచి తమతో పాటు అనేక మంది కాపులు ఉన్నట్టు పేర్కొన్నారు. అలాంటి ద్రోహితో చేతులు కలిపిన పవన్‌కళ్యాణ్ కాపులకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కాపుల సంక్షేమమే లక్ష్యంగా మొదటి నుంచి పోరాడుతున్న ముద్రగడ పద్మనాభంపై పవన్‌కళ్యాణ్ నోటికి వచ్చినట్లు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కాపు నాయకులు బాలిశెట్టి కిషోర్, దొరైరాజ్, శేఖర్‌రాయల్, పద్మజ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నుంచి జూలై 5వ తేదీ వరకు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ముఖ్యమైన రోజుల్లో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయంలో క్యూలను పటిష్టపరచాలన్నారు. గతంలో అగ్నిగుండం వెడల్పు తక్కువగా ఉండేదని, ఇప్పుడు పది అడుగుల వెడల్పు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామారావు, ఆలయ పూజారి పురుషోత్తం, ప్రముఖులు హరినాయుడు, గణేష్ పాల్గొన్నారు.

పరంపవే టెక్నాలజీతో రోడ్ల ఏర్పాటు



పరంపవే టెక్నాలజీపై చర్చిస్తున్న అధికారులు

తిరుపతి తుడా: తక్కువ ఖర్చు.. ఉష్ణోగ్రతను తగ్గించి భూమిలోకి వర్షపు నీరు వెంటనే ఇంకిపోయే పరంపవే నూతన టెక్నాలజీతో రోడ్లను అభివృద్ధి చేసేందుకు తిరుపతి ఐఐటీ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, ఐఐటీ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీర్లతో నూతన టెక్నాలజీపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరంపవే నూతన టెక్నాలజీతో రోడ్లను అభివృద్ధి చేయడం వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయని గుర్తించామన్నారు. అంతకుముందు తిరుపతి ఐఐటీ ప్రతినిధి అసోసియేట్ ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరంపవే టెక్నాలజీ విధి విధానాలపై వివరించారు. ఈ టెక్నాలజీతో రోడ్లు వేయడం వలన కార్పొరేషన్‌కు ఖర్చు తగ్గడంతోపాటు వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి పంపించేందుకు దోహదపడుతుందన్నారు. మామూలు రోడ్లతో పోల్చితే ఈ రోడ్లపై 20 శాతం వరకు ఉష్ణోగ్రత తగ్గుతుందని వివరించారు. ఎక్కువ కాలం మన్నిక ఉంటుందని చెప్పారు. ట్రయల్ రన్‌గా ఒక రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 23 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో చక్రవర్తిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం విప్రో సంస్థలో ఉద్యోగాలకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 23 మంది ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ డీవీఎస్.చక్రవర్తిరెడ్డి తెలిపారు. ఇంటర్వ్యూలకు డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీరికి వివిధ దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించి ప్రతిభ చూపిన 23 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగంతో పాటు పీజీ విద్యను అభ్యసించడానికి ఆ సంస్థ సహాయం అందిస్తుందని వివరించారు.

పల్లికొండేశ్వరుని సేవలో దేవదాయ శాఖ ఆర్జేసీ

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పల్లికొండేశ్వరస్వామిని దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ సాగర్‌బాబు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఆయన స్వయంభు వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిగ, దాంపత్య దక్షిణామూర్తి, మంగళాదేవి సమేత పల్లికొండేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి, బోర్డు సభ్యులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తిరుపతి అర్బన్: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, బస్సులను శుభ్రంగా ఉంచి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని తిరుపతి ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీ కోరారు. ఆయన గురువారం పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరుపతికి దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారని వెల్లడించారు. ఈ క్రమంలో తిరుపతి గౌరవాన్ని నిలబెట్టాలంటే ఆర్టీసీ బస్సులు శుభ్రంగా ఉండాలన్నారు. జిల్లాలో రోజు ఆర్టీసీ సర్వీసుల ద్వారా 5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, తిరుపతి బస్టాండ్ నుంచి రెండు లక్షల మంది ప్రయాణిస్తున్నారని వివరించారు. జిల్లా కేంద్రమైన తిరుపతి బస్టాండ్‌లో పనిచేసే సిబ్బంది ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఎవరికి కేటాయించిన పనులు వారు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఇన్‌చార్జి పి.చాందిని, గ్యారేజ్ పర్యవేక్షక సిబ్బంది త్యాగరాజ ఆచారి, వేలు పాల్గొన్నారు.